# జయప్రదమైన సమ్మె - అందరికీ అభినందనలు!

**- బిఎస్ఎన్ఎల్ఇయు**

19, 20 ఆగస్టు 2009 రెండు రోజుల సమ్మె అనూహ్యంగా, అద్భుతంగా, విజయవంతంగా జరిగింది. సమ్మె పిలుపునిచ్చిన బిఎస్ఎన్ఎల్ఇయు ఐక్యవేదిక బలం 50 శాతమే అయినప్పటికీ 60 శాతం పైగా ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. మరో 20 శాతం సెలవు పెట్టారు. మొత్తం 80 శాతం విధులకు హాజరుకాలేదు. కొన్ని సర్కిల్సులో నూరు శాతం సమ్మె జరిగింది. తాము సమ్మెలో పాల్గొనటం లేదని ఎన్ఎఫ్టిఇ-ఎఫ్ఎన్టిఓ జనరల్ సెక్రటరీలు మేనేజ్మెంటుకి లెటరు రాసినప్పటికీ, ఆ యూనియన్ల సభ్యులు అనేకమంది అనేకచోట్ల సమ్మెలో పాల్గొన్నారు. ఉద్యోగులలో పెల్లుబుకుతున్న ఐక్య పోరాట వాంఛను ప్రదర్శించారు. సమ్మె తక్కువగా జరిగినట్లు చిత్రించటానికి 50 శాతమే పాల్గొన్నారని మేనేజిమెంటు అంటున్నప్పటికీ, అది ఆ మేరకు అంగీకరించటమే సమ్మె ఘన విజయానికి నిదర్శనం.

బిఎస్ఎన్ఎల్ బోర్డు డైరెక్టర్లు 1.1.2007 నుండి అమలులోకి వచ్చే విధంగా తమ వేతనాలు 62 శాతం పెంచుకున్నారు. అంతేగాక, ఎప్పుడనుకుంటే అప్పుడు, ఎటువంటి కాలవ్యవధి లేకుండా, తమ వేతనాలు మళ్ళీ పెంచుకునే అవకాశాన్ని అట్టిపెట్టుకున్నారు. కానీ తమ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 1.1.2007 నుండి కేవలం 30 శాతం పెరుగుదలనే ప్రతిపాదించారు. అది కూడా మళ్ళీ పదేళ్ళ వరకూ, అనగా 31.12.2016 వరకూ, వేతనాలు పెంచమని అడగకుండా వుండేందుకు అంగీకరిస్తేనే ఇస్తామని పేచీ పెడుతున్నారు. ఇతర ప్రభుత్వరంగ సంస్థలు ఐదేళ్ళ కొకసారి వేతన సవరణకు సూత్రప్రాయంగా అంగీకరిస్తున్నాయి. కానీ బిఎస్ఎన్ఎల్ యాజమాన్యం ఈ న్యాయమైన కోరికను తిరస్కరిస్తున్నది. ఇతర ప్రభుత్వరంగ సంస్థలు మూలవేతనం మరియు 78.2 శాతం డి.ఎ.పై లెక్కించి వేతన పెరుగుదల శాతాన్ని నిర్ణయించేందుకు అంగీకరించాయి. కానీ బిఎస్ఎన్ఎల్ యాజమాన్యం, మూలవేతనం మరియు 68.8 శాతం డి.ఎ.పై మాత్రమే లెక్కించి వేతన పెరుగుదల శాతాన్ని నిర్ణయిస్తామంటున్నది. కాంట్రాక్టు/క్యాజువల్ కార్మికులకు చట్టబద్ధ వేతనాల చెల్లింపు అమలు జరిగేలా చూసే బాధ్యత, వారి డిమాండ్స్ పరిశీలించే బాధ్యత తనకి లేదంటున్నది. అక్టోబరు 2008లో కుదిరిన ప్రమోషన్ పాలసీ ఒప్పందాన్ని అమలు చేయలేదు. పే అనామలీస్ సమస్యను పరిష్కరించటం లేదు.

తాను అనుసరిస్తున్న ఈ తప్పుడు వైఖరిని ఉద్యోగులు సహిస్తారనీ, సమ్మెలో ఎక్కువమంది పాల్గొనరని మేనేజిమెంటు అంచనా వేసింది. తన కార్మిక వ్యతిరేక విధానాలకు భజన చేస్తున్న ఎన్ఎఫ్టిఇ-ఎఫ్ఎన్టిఓ నాయకులకు ఉద్యోగులలో చీలిక తెచ్చి సమ్మె విఫలం చేసే సత్తా వుందని ఆశించింది. కానీ ఇందుకు భిన్నంగా సమ్మె అద్భుతంగా జరిగింది. ఇది మేనేజిమెంటుకి చెంపదెబ్బ వంటిది. మేనేజిమెంటు తప్పుడు విధానాలకు భజన చేస్తున్న తమ వైఖరిని తమ సభ్యులే తిరస్కరిస్తున్నారని ఎన్ఎఫ్టిఇ-ఎఫ్ఎన్టిఓ నాయకులకు ఈ సమ్మె రుజువు చేసింది.

సోదర ప్రభుత్వరంగ సంస్థ బిఇఎల్లో ఇటీవల 28.5.2009న ఒకరోజు సమ్మె జరిగింది. ఒకరోజు సమ్మెకి ఒకరోజు వేతనం కోత పడింది. కానీ ఆ తరువాత జులై 2009లో జరిగిన చర్చలలో ఆ సమ్మె ఒత్తిడి వలన మేనేజిమెంటు తన మొండివైఖరిని కొంత సడలించుకోవాల్సి వచ్చింది. ఇదే విధంగా బ్యాంకు ఉద్యోగులు 2008 సెప్టెంబరు 24, 25 రెండు రోజులు, మళ్ళీ 2009 ఆగస్టు 7, 8 రెండు రోజులు సమ్మె చేశారు. సమ్మె కాలానికి వేతనాలు కోల్పోయారు. కానీ ఈ సమ్మెల ప్రభావం వలన బ్యాంకు యాజమాన్యాలు తమ మొండివైఖరిని కొంత సడలించుకోవాల్సి వచ్చింది. ఇదే విధంగా మన రెండు రోజుల సమ్మె ఒత్తిడి వలన త్వరలో జరగబోయే వేతన చర్చలలో బిఎస్ఎన్ఎల్ మేనేజిమెంటు కూడా తన మొండివైఖరిని సడలించుకోవాల్సి వస్తుంది. ఒకవేళ మేనేజిమెంటు ఇంకా మొండివైఖరితో వ్యవహరిస్తే దానికి బుద్ధి చెప్పేందుకు మరింత పెద్ద ఎత్తున మనం పోరాడాల్సి వుంటుంది. మరో మార్గం లేదు.

ఈ సమ్మె జయప్రదం అయినందున బిఎస్ఎన్ఎల్లో పది శాతం వాటాలు తెగనమ్మే తన దుష్ట పథకాన్ని అమలుచేసే విషయంలో ప్రభుత్వం ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుందని ఆశిస్తున్నాము. ప్రభుత్వరంగ సంస్థల కార్మికోద్యమ చరిత్రలో ఈ సమ్మె ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టించింది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్మిక వర్గ పోరాటానికి ఈ సమ్మె మరింత బలాన్నిస్తుంది. ఈ సమ్మెలో పాల్గొన్న బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులందరికి అభినందనలు తెలియజేస్తున్నాము. ఈ సమ్మెకి మద్దతు ప్రకటించిన సిఐటియు, ఎన్ఎఫ్పిఇ, బిఇఎఫ్ఐ, ఏఐఐఇఎ, సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కాన్ఫెడరేషన్, తదితర సోదర కార్మిక సంఘాలకు, పెన్షనర్స్ అసోసియేషన్స్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

*అభినందనలతో*

**బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్**

**.................................... జిల్లా శాఖ**